క్లుప్తంగా

మ్యాగజైన్ ఆవిష్కరణ



మ్యాగ్‌జైన్‌ను విడుదల చేస్తున్న ఆర్డీవో అఖిల తదితరులు

రామచంద్రపురం: పట్టణంలో మోడరన్ విద్యా సంస్థల మ్యాగజైన్‌ని ఆర్డీఓ డి.అఖిల బుధవారం ఆవిష్కరించారు. మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకను ప్రోత్సాహించేలా మ్యాగజైన్‌ని రూపొందించడం మంచి ప్రయత్నమన్నారు. కాకినాడ వేగా జ్యువెలర్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మోడరన్ అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వేంకటేశ్వర్లు, ఇంటర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి హైస్కూల్ హెచ్ ఎం. చిట్టిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్ శ్రీనివాస్, మోడరన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం డివిజన్ ఈఈ కె.రత్నాలరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల వెంబడి చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో కాలేరు ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు. కపిలేశ్వరపురం, వెదురుమూడి, పడమర ఖండ్రిక, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు.

అంగరలో క్రైస్తవుల శాంతియాత్ర



అంగరలో శాంతి ర్యాలీ చేస్తున్న రేమా పెంతెకోస్టు చర్చి క్రైస్తవ భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరకు చెందిన రేమా పెంతెకోస్తు చర్చి సంఘస్తులు మంగళవారం రాత్రి శాంతియాత్ర నిర్వహించారు. చర్చి నిర్వాహకులు ఖండవిల్లి రాణి ఆధ్వర్యంలో అంగర చర్చి నుంచి ప్రారంభమై అంగర, పడమర ఖండ్రిక గ్రామాల వీధుల్లో ర్యాలీ చేస్తూ శాంతి నినాదాలిచ్చారు. భక్తిగీతాలు ఆలపించారు. క్రైస్తవ ప్రబోధకులు మాట్లాడుతూ ఏసు బోధనలు ప్రపంచశాంతికి మార్గదర్శకాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

వెదురుపాకలో దుప్పట్లు, పండ్ల పంపిణీ



వెదురుపాకలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాపు ఐక్య సంఘం నేతలు

రాయవరం: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని వెదురుపాకలోని జనార్దన స్వామి ఆలయంలో కాపు ఐక్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మొత్తం 60 మందికి దుప్పట్లు, పండ్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ ఏడాది నుంచి కాపు ఐక్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సఖినేటిపల్లిలో 'రక్తపింజరి'


సఖినేటిపల్లి: గ్రామంలోని ఓ పంట కాలువలో బుధవారం రక్తపింజరి పాము కలకలం రేపింది. స్థానికులు దీనిని గుర్తించి అమలాపురంలోని స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన అక్కడకు చేరుకుని, రక్తపింజరిని చాకచక్యంగా పట్టుకుని, ఒక డబ్బాలో బంధించి, సురక్షిత ప్రాంతానికి తరలించారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్ హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు.

కాలిబాటతో లాభాలెన్నో..

- వరిసాగులో కాలిబాట అత్యంత అవసరం
- పంట ఎదుగుదల, అధిక దిగుబడి
- నిర్వహణపై వ్యవసాయాధికారుల సూచనలు



కాజులూరులో వెదజల్లిన పొలంలో వేసిన కాలిబాటలు

కాజులూరు: వరి పంటలో కాలిబాటలు వేయడం ద్వారా అధిక దిగుబడి రావటమే కాకుండా పంటపై తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే డెల్టాలో కొందరు రైతులు రబీలో కాలిబాటలు వేయడం వృథా ఖర్చుగా భావించి వెనుకడుగు వేస్తున్నారని పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే అదనపు దిగుబడిని పొందవచ్చని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు. పొలంలో కాలిబాటలు వేయడానికి ఎకరానికి రూ.800 ఖర్చయితే నాలుగు బస్తాల దిగుబడిని అదనంగా పొందవచ్చనంటున్నారు. కాలి బాటలు వెసుకునే విధానం, లాభాలపై ఆయన పలు సూచనలు చేశారు.

కాలి బాటలు వేసే విధానం

వరి పొలంలో కాలిబాటలు వేసేందుకు పొడవాటి తాడును గట్టు ఒకవైపు నుంచి గట్టు మరొక వైపునకు పట్టుకోవాలి. తాడు పొడవునా ఒక అడుగు వెడల్పున వరి మొక్కలను తీసి పక్కన పలుచగా నాటాలి. పొలంలో గట్ల పక్క నుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా చూసుకుని బాటలు వేయాలి. ప్రతి రెండు మీటర్లకు ఒక కాలి బాట పడేలా చుడాలి.

ఉపయోగాలు

కాలి బాటల వల్ల వరి మొదళ్లకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు త్వరగా ఆశించకుండా ఉంటాయి. బాటలకు ఇరుపక్కలా ఉన్న కుదురులు అధికంగా దుబ్బు చేస్తుంది. బాటలు వెంబడి నడుస్తూ పంట తెగుళ్ల గుర్తించుటకు కలుపు మొక్కలు ఏరివేయడానికి వీలుగా ఉంటుంది. రసాయనిక ఎరువులు సమర్థవంతంగా వేసుకోవచ్చు. చీడపీడలకు, సస్యరక్షణ చేయాల్సిన అవసరముంటే ముందుగా తెగులుసోకిన చోట మందులను పిచికారీ చేసి తదుపరి మిగిలినచోట చేయవచ్చు. బాటలు వెంబడి ఎలుకల నివారణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. ప్రతిరోజు పొలంలో వరి పంటను సమగ్రంగా పరిశీలించవచ్చు. బాటలు పక్కన ఉన్న దుబ్బులు మూడు, నాలుగు పిలకలు అధికంగా చేయడంతో పాటు, బాటలు వెంబడి తీసిన మూనలు ఖాళీ స్థలంలో ఊడ్చడం వల్ల ఎకరానికి 250 నుంచి 350 కిలోల వరకు దిగుబడిని అదనంగా పొందవచ్చు.

ఖర్చుకు మించి ఆదాయం



రైతులు అదనపు ఖర్చులు ఎందుకని భావించి కాలిబాటలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. నైపుణ్యం ఉన్న ఇద్దరు కూలీలను నియమిస్తే రోజుకు రెండు ఎకరాలలో కాలిబాటలు వెస్తారు. ఆ ఖర్చుకు మించి నాలుగింతల ఆదాయం పెరుగుతుంది.

– పి.వి.వి.సత్యనారాయణరెడ్డి, రైతు మొగలిపాలెం

వేరు బలపడక ముందే..



నాటిన వరి దుబ్బు వేరు బలపడకముందే పొలంలో కాలిబాటలు వేసుకోవాలి. దానివలన పని సులువుగా అవుతుంది. మారు నాటిన మొక్క చనిపోకుండా ఉంటుంది. కాలిబాటలలో తీసిన మొక్కలను మూనలు తక్కువగా ఉన్నచోట నాటుకోవాలి. పొలంలో గాలి, వెలుతురు ప్రసరణ సక్రమంగా జరిగి పంటపై తెగుళ్ల తగ్గుతాయి.

– వి.అశోక్, కాజులూరు మండల వ్యవసాయాధికారి

పీఠంలో సామూహిక కుంకుమ పూజలు



గాడ్ సమక్షంలో పీఠం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బాపిరాజు, బాబి తదితరులు

రాయవరం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) సూచించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బుధవారం వెదురుపాక విజయదుర్గా పీఠానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇష్టదైవాన్ని ప్రార్థించుకోవడం వలన కొంత వరకూ ఉపశమనం పొందే వీలుందని గాడ్ అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, లలితా అష్టోత్తర, సహస్ర నామాలు, దుర్గా, లక్ష్మి, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు చేశారు. అనంతరం విజయదుర్గా పీఠం ఆధ్యాత్మిక క్యాలెండర్‌ను పీఠాధిపతి గాడ్ సమక్షంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, గాదె సత్యవెంకటకామేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరించారు.



విజయదుర్గా అమ్మవారు

వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ



వాడపల్లిలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో స్వామి వారికి నిత్య కల్యాణాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ నెల 13న ధనుర్మాసం చివరిలో భోగి పర్వదినాన గోదాదేవి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవ స్వామి, ఉమా కమండలేశ్వర స్వామి, ఆత్రేయపురంలో ఉన్న బాలా త్రిపుర సుందరీ రాజరాజేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలతో పాటు కనక మహాలక్ష్మి, మల్లమ్మ ఆలయాలను భక్తులు దర్శించారు.


భీమేశ్వరాలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ సిబ్బందికి నూతన దుస్తులు అందజేశారు. ఆలయంలో ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మడకా రాంబాబు, చంటి రెడ్డి, దవులూరి రామకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధావతారంలో దర్శనమిచ్చిన శ్రీవారు



రాయవరం: స్థానికంగా కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు బుధవారం బుద్ధావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారిని బుద్ధావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతారాల్లో భాగంగా పూజలు చేశారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు దశావతార మహోత్సవాల్లో పాల్గొన్నారు.

5న వేంకటేశ్వరునికి లక్ష తులసి పూజ

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి వారికి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే లక్ష తులసి పూజ మహోత్సవాన్ని ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ లక్ష తులసి పూజలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పూజా కార్యక్రమాలు చేస్తారు. అంతకు ముందు ధనుర్మాసం సందర్భంగా స్వామివారిని గ్రామోత్సం నిర్వహించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



హసన్‌బాదలో ఎంపీ బోస్, సూర్యప్రకాశ్‌లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు



మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును గజమాలతో సత్కరిస్తున్న సోమేశ్వరం సర్పంచ్, గ్రామస్తులు

కె.గంగవరం: ఎన్నో తీపి జ్ఞాపకాలు మధ్య గడచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ మండలంలో ప్రజలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. అర్థరాత్రి నుంచి యువకులు బైక్‌లపై హల్‌చల్ చేస్తూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలు గ్రామాల్లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుందూరు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, ఎంపీపీ పంపన నాగమణి స్వగృహం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది ఎంపీపీ నాగమణిని స్వయంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు రెవెన్యూ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ఎన్.శ్రీనివాస్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కాజులూరు మండలంలో..

కాజులూరు: మండల గ్రామాల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. 2025 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలువురు కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మహిళలు తమ, తమ ఇళ్ల ముందు రంగులతో రంగవల్లులు వేశారు. గొల్లపాలెం అలయన్స్ క్లబ్ సభ్యులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించగా పలువురు స్థానిక యువకులు కాజులూరు జంక్షన్‌లో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. కొత్త సంవత్సరంలో అందరికి శుభాలు కలగాలని కోరుతూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల గ్రామాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఆయా నాయకులను కలుసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు, పలువురు స్థానిక నాయకులు అధికారులు, నేతలను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు.

నూతన సంవత్సరంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర కానుంది

రామచంద్రపురం: ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ఏర్పడిన మీ మంచి ప్రభుత్వం అందరి ఆశలు నెరవేర్చేలా అహర్నిశలు పని చేస్తోందని, నూతన సంవత్సరంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర కానుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వీఎస్ఎం కళాశాల ప్రాంగణం వద్ద మంత్రి సుభాష్‌కి శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీ బోస్ ఇంటా సందడి

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఇంట బుధవారం నూతన సంవత్సర సందడి నెలకొంది. జెడ్పీటీసీలు మేర్నీడి వెంకటేశ్వరరావు, వనుము వెంకట సుబ్బారావు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మాతా భారతి, మూడు మండలాల వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, కుల సంఘాల నాయకులు ఎంపీ బోస్, ఆయన తనయుడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇంటి వద్ద...

ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ తోట త్రిమూర్తులు ఇంటి వద్ద నూతన సంవత్సర సందడి నెలకొంది. నియోకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు ఆయనను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మండలంలో ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద..

మండలంలోని ప్రజాప్రతినిధులు జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైఎస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇళ్ల వద్ద నూతన సంవత్సర సందడి నెలకొంది. పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు ఉద్యోగులు నాయకులను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తోట త్రిమూర్తులు కార్యాలయం వద్ద..

మండపేట: నూతన సంవత్సర వేడుకలను పట్టణ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య పండగలా జరుపుకున్నారు. పట్టణంలోని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు కార్యాలయానికి బుధవారం నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు తరలివచ్చారు. వారంతా ఆయనకు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రజలు ఆనందంతో శాంతి సౌభాగ్యాలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నేతలు రెడ్డి రాజబాబు, వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరిల ఇంట కూడా కార్యకర్తలు అభిమానులు సందడి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి రథంసెంటర్‌లోని తన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించారు. శాసన సభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావు నివాసం వద్ద కూడా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయనకు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, జ్ఞాపికలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కపిలేశ్వరపురం: ప్రేమానురాగాలను కాంక్షిస్తూ మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకను సందడిగా జరుపుకున్నారు. విద్యార్థులు తమ స్నేహితుల వద్దకు వెళ్లి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఉద్యోగులు, సిబ్బంది తమ శాఖల అధికారులను కలిసి బొకేలను అందజేశారు. గ్రామాల వీధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే ముగ్గులతో దర్శనమిచ్చాయి. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ పార్టీల నాయకుల కార్యాలయాలు, ఇళ్ళను సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రు చిట్టిబాబు నివాసాలు ప్రజాప్రతినిధులు, అభిమానులతో సందడిగా మారాయి. పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లోని సర్పంచ్, ఎంపీటీసీలకు శుభాకాంక్షలు తెలిపారు. 19 గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండపేటలోని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సీనియర్ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, రెడ్డి రాధాకృష్ణ నివాసాలకు వెళ్ళి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు మండపేటలోని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు క్యాంపు కార్యాలయం, జనసేన నాయకులు వల్లూరులోని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ నివాసాలకు తరలివె వెళ్ళి శుభాకాంక్షలు తెలిపారు.

రాయవరం: కొత్త సంవత్సవరం సందర్భంగా బుధవారం వేకువజామునే అధిక సంఖ్యాకులు వివిధ దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. కిందిస్థాయి ఉద్యోగులు పైస్థాయి అధికారులను కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, పసలపూడిలో జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీడీవో కీర్తిస్పందన, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ తదితరుల వద్దకు ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రాజకీయపక్షాల నేతలకు, వైద్యులకు పలువురు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. వీధులన్నీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే రంగవల్లులతో నిండిపోయాయి. తరగతి గదుల్లో విద్యార్థులు ఉపాధ్యాయులచే కేక్‌లు కట్ చేయించి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచే చర్చిలకు చేరుకున్న క్రైస్తవ మతారాధకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుని, ప్రార్థనల్లో పాల్గొన్నారు.



కుందూరులో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ నాగమణి, మండల పరిషత్ సిబ్బంది తదితరులు



రాయవరంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు శశిధర్‌శర్మ



మంత్రి సుభాష్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న దేవదాయ శాఖ అధికారులు



రాయవరంలో ఎంపీపీ వెంకటరమణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు



మండపేటలో ఎమ్మెల్సీ తోటకు శుభాకాంక్షలు చెబుతున్న కపిలేశ్వరపురం ఎంపీపీ తదితరులు